క్లుప్తంగా

యోగా శిబిరం



నర్సంపేట : పట్టణంలోని బాయ్స్ హైస్కూల్‌లో బాపూజీ సదానందం ఆధ్వర్యంలో శ్రీపరివార్ 21 రోజుల యోగ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆచార్యులు రాఘవులు బాపూజీ యోగ సాధకులకు బ్రహ్మోపదేశం చేశారు. నర్సంపేట, గోదావరిఖని ప్రాంతాల నుంచి మారు 45 మంది సాధకులు హాజరై బ్రహ్మోపదేశం స్వీకరించారు. కార్యక్రమంలో వంశీకృష్ణ, ట్రెయినీ నరేంద్రచారి, తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నర్సంపేట : పాత పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నేడు (సోమవారం) నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను పట్టణంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడం సాంబయ్య, శీలం మల్లయ్య ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. పాత పింఛన్ విధానాన్ని రద్దు చేస్తామని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. మహాధర్నాకు మండలం నుంచి ఉపాధ్యాయులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వర్ధన్నపేట : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా.. పట్టణంలోని వరంగల్‌-ఖమ్మం జాతీయ రహదారిపైనున్న అంబేడ్కర్ కూడలి వద్ద ద్విచక్ర వాహనాన్ని వరంగల్ దిశగా ప్రయాణిస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న రాయపర్తి మండలంలోని మహబూబ్‌నగర్‌కు చెందిన దూదయ్య, మరొకరు గాయాలపాలయ్యారు. ఇద్దరినీ స్థానికులు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బియ్యం లారీ బోల్తా



నెక్కొండ : ప్రమాదవశాత్తు లారీ బోల్తాపడిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా కొడకండ్ల మండలం నుంచి బియ్యం దిగుమతి కోసం నెక్కొండ రైల్వే ఎఫ్‌సీఐ గోదాంకు వెళ్తున్న లారీ నెక్కొండ బైపాస్ రోడ్డు మూలమలుపులో అదుపు తప్పి లారీ బోల్తాపడింది. డ్రైవర్‌తో సహా ఎవరికీ గాయాలు కాలేదు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన కత్తి చిన్నమల్లయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య ఆదివారం కలిసి పరామర్శించారు. చిన్న మల్లయ్య మృతి బాధాకరమని తెలిపారు. అనంతరం కుటుంబానికి క్వింటా బియ్యం సాయంగా అందించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మొగ్రి రాజేందర్, డాక్టర్ శ్రీను, గిరుక సురేశ్, కత్తి ఉప్పలయ్య, కత్తి సత్తయ్య, కత్తి వెంకన్న, చెన్నబోయిన యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్సై

దామెర : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన వ్యక్తిని పోలీస్ వాహనంలో ఆస్పత్రికి తరలించి స్థానిక ఎస్సై కొంక అశోక్ మానవత్వం చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెట్రోలింగ్‌లో భాగంగా ఎస్సై అశోక్ మండల కేంద్రం నుంచి ల్యాదెళ్లకు తమ వాహనంలో వెళ్తున్నారు. ఈ క్రమంలో పరకాల మండలం పోచారం గ్రామానికి చెందిన మనోహర్ ద్విచక్రవాహనంపై హనుమకొండకు వస్తుండగా మండల కేంద్రానికి చేరుకోగానే ద్విచక్ర వాహనానికి కోతి అడ్డు వచ్చింది. దీంతో అదుపుతప్పి కిందపడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఎస్సై 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ వచ్చేందుకు సమయం పట్టననుండగా ఎస్సై తన వాహనంలో క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తుండడంతో ఆరెపల్లి వద్ద అంబులెన్స్ ఎదురవడంతో అందులో ఎక్కించి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఎస్సైతోపాటు కానిస్టేబుల్ శ్రీనివాస్, డ్రైవర్ రాజును స్థానికులు అభినందించారు.

స్తంభాలపై కేబుల్స్ అస్తవ్యస్తం

● తొలగింపులో అధికారుల నిర్లక్ష్యం

సంగెం : మండలంలోని పలు విద్యుత్ స్తంభాలపై టీవీ, ఇంటర్నెట్ కేబుల్స్ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వాటిని సరి చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా క్రమ పద్ధతిలో కేబుల్ వైర్లు ఉంచాల్సి ఉండగా అందుకు భిన్నంగా గందరగోళంగా ఏర్పాటు చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లను తొలగించడంలో విద్యుత్ శాఖ అధికారులు తాత్సారం చేయడంలోని ఆంతర్యం తెలియడం లేదు.

మండలంలోని సంగెం, కుంటపల్లి, తిమ్మాపూర్, తీగరాజుపల్లి, గవిచర్ల, కాపుల కనిపర్తి తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు టీవీ, ఇంటర్నెట్ సంబంధిత కేబుల్ వైర్లు అస్తవ్యస్తంగా ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల కేబుల్ వైర్లు తెగి కిందకు వేలాడుతూ వాహనచోదకులను, ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. వేలాడుతున్న తీగలు తగిలి వాహనచోదకులు ప్రమాదాల బారిన పడిన ఘటనలూ ఉన్నాయి. కేబుల్ వైర్లు అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి మండలంలోని అన్ని గ్రామాల్లోనూ విద్యుత్ స్తంభాలపై అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్ వైర్లను తొలగించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట విద్యుత్ స్తంభంపై అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్స్

తొలగించాలని ఆదేశించాం

పలు చోట్ల విద్యుత్ స్తంభాలపై కేబుల్స్ అస్తవ్యస్తంగా ఉన్నాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు విద్యుత్ ఉద్యోగులు స్తంభాలు ఎక్కడానికి కేబుల్స్ అడ్డంకిగా మారాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్స్‌ను వెంటనే తొలగించాలని సంబంధిత కేబుల్ ఆపరేటర్లకు తెలియజేశాము.

\- మధుసూదన్, ఏఈ, ట్రాన్స్‌కో

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 2009–10 విద్యా సంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 15 ఏళ్ల తర్వాత ఒకరినొకరు తాము చదువుకున్న స్కూల్‌లో కలుసుకుని సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. సామూహిక భోజనాలు ఏర్పాటు చేసుకుని స్నేహభావాన్ని చాటారు. కలకాలం స్నేహం కొనసాగించాలని, కష్టాల్లో ఉన్న మిత్రులకు అండగా నివాలని, వీలైతే సామాజిక సేవలు అందించాలని ఐక్యంగా నిర్ణయించుకున్నారు. అనంతరం తమకు బాల్యంలో విద్యాబోధన అందించిన నాటి ప్రధానోపాధ్యాయురాలు విజయ, ఉపాధ్యాయులు భద్రయ్య, రావుల భాస్కర్‌రావు, తండా ప్రభాకర్, సోమయ్య, విజయలక్ష్మి, తిరునహరి నిర్మల, మారం రోజారాణి, మీనాకుమారి, ఉప్పలయ్యలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు కోల రాజు, కొమ్ము ప్రభాకర్, రహీమ్, బోయిని సంపత్, బాధ అశోక్, పోతర్ల సుధాకర్, నాయిని శ్రీను, సుమన్, చిర్ర అశోక్, టి.సరిత, స్వప్న, భవానీ, స్వాతి, శిరీష, రమేశ్, శ్రీనివాస్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలుతో బీజేపీకి ప్రజాదరణ



సమావేశంలో మాట్లాడుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

● జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బాంజిపేటకు చెందిన వివిధ పార్టీల యువకులు గ్రామ బూత్ కమిటీ అధ్యక్షుడు తాళ్లపెల్లి రఘు ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీకి చేరగా వారికి ప్రతాప్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. పేదల సంక్షేమానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక పథకాలు రూపొందించి సమర్థవంతంగా అమలు చేస్తోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతోనే గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. పథకాలకు ఆకర్షితులై, ప్రజాదరణను గుర్తించి పలువురు బీజేపీలో చేరడానికి ముందుకొస్తున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవడానికి నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. పార్టీ యువతకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పార్టీలో చేరిన వారికి అండగా ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో పార్లమెంటరీ నియోజకవర్గ కోకన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ గంగిడి మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గణనాథులకు ప్రత్యేక పూజలు



నర్సంపేట : వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పర్వతగిరి : పూజలు నిర్వహిస్తున్న గణేశ్ యూత్ అసోసియేషన్ బాధ్యులు

నర్సంపేట/దుగ్గొండి/రాయపర్తి/పర్వతగిరి : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నర్సంపేట, దుగ్గొండి, రాయపర్తి, పర్వతగిరి మండలాల్లోని గణపతి మండపాల వద్ద వినాయకుడికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నర్సంపేటలోని పలు వార్డుల్లో, దుగ్గొండి మండలంలోని బొద్రాయి సెంటర్‌లో, రాయపర్తిలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో, మైలారంలోని ఊకల్ ఎక్స్ రోడ్డులో గణేశ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిని పూజించారు. అలాగే ఆయా చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రవి, ఆర్చకుడు రమేశ్‌మూర్తి, గణేష్ యూత్, వివేకానంద యూత్ సభ్యులు ఎనగందుల యాదగిరి, ఎనగందుల శ్రావణ్‌కుమార్, నూనె అనిల్, బూరుగు నవీన్, ధినేశ్, వరుణ్, గణేశ్, సంగీత్, కిశోర్, రాహుల్, శశి, సందీప్, సాయి, యశ్వంత్, ప్రశాంత్, గణేశ్ యూత్ అసోసియేషన్ బాధ్యులు ఆడెపు సలేంద్ర, వేముల అజయ్, బాసాని శ్రీనివాస్, బాసాని సంపత్, గూడెల్లి ప్రశాంత్, బాసాని ప్రసాద్, గోనె రవి, ఆర్మూర్ శ్రీనివాస్, పుల్ల శ్రీనురెడ్డి, బాసాని భిక్షపతి, కొల్లూరి హేమంత్, భూషెట్టి అఖిల్, తదితరులు పాల్గొన్నారు.



దుగ్గొండి : నాచినపల్లి బొద్రాయి సెంటర్ గణపతి వద్ద కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

క్రీడలతో శారీరక, మానసిక వికాసం



విజేతగా నిలిచిన క్రీడాకారులతో డాక్టర్ శ్రీనివాస్ గౌడ్, తదితరులు

● కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ శ్రీనివాస్

నర్సంపేట : క్రీడలు శారీరక, మానసిక వికాసానికి బాటలు వేస్తాయని కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మినీ స్టేడియంలో జిల్లా యువజన, క్రీడల అధికారిని టీవీఎల్ సత్యవాణి ఆధ్వర్యంలో స్టేడియం కబడ్డీ ఇన్‌చార్జ్, కోచ్ యాట రవికుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన కబడ్డీ ఆహ్వానిత టోర్నమెంట్‌ను శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు ప్రత్యేక అతిథి హాజరైన జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి ఈసాల లక్ష్మయ్య, విశిష్ట అతిథిగా హాజరైన జిల్లా ప్రైవేటు వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పరికి ప్రశాంత్, కోశాధికారి రచ్చ భవానీ చంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. ప్రతిఒక్కరూ బాల్యం నుంచే క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడాకారులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రైవేటు వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం సహాయ కార్యదర్శులు ఉరుసుల శేఖర్ యాదవ్, కుంట విజేందర్, వజ్జ రాజేశ్, స్పోర్ట్స్ సెక్రటరీ మాదాసి అజయ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు మహ్మద్ రియాజుద్దీన్, దుగ్గి సురేశ్, మురళి, సోషల్ వెల్ఫేర్ ఫిజికల్ డైరెక్టర్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

డీజే బాక్స్‌ల అందజేత



రాయపర్తి : మండలంలోని మైలారం, గట్టికల్ గ్రామాల్లోని వినాయక ఉత్సవ కమిటీలకు ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధి లేతాకుల మధూకర్‌రెడ్డి ఆదివారం డీజే బాక్స్‌లు అందజేశారు. అనంతరం మధూకర్‌రెడ్డి మాట్లాడారు. మైలారంలోని ఇండిపెండెన్స్ యూత్‌తోపాటు గట్టికల్‌లోని నేతాజీ యూత్ అసోసియేషన్ సభ్యులకు ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సాయంతో డీజే బాక్స్‌లు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమాల్లో నాయకులు గూడెల్లి వెంకటయ్య, కోల సంపత్, తదితరులు పాల్గొన్నారు.

గుడారాలు వేసుకున్న వారితో ఇబ్బందులు

● బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాంబాబు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 16 డివిజన్ ధర్మారం రైల్వే గేటు అవతల ప్రాంతంలో గుడారాలు వేసుకుని నివాసం ఉంటున్న యూపీ నుంచి వచ్చి గుడారాలు వేసుకున్న ప్రజలతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గట్టికొప్పుల రాంబాబు తెలిపారు. పార్టీ నాయకులతో కలిసి గుడారాలు వేసుకున్న యూపీ వాసులను ఆదివారం రాంబాబు కలిసి మాట్లాడారు. స్థానికులకు ఇబ్బందులు కలిగించకుండా జీవించాలని, దొంగతనాలకు పాల్పడవద్దని, బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేయొద్దని, తదితర సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. స్థానికంగా గుడారాలు వేసుకుని ఉంటున్న యూపీకి చెందిన వారితో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెట్టారు. బొల్లం రమేశ్ అనే రైతుకు చెందిన మొక్కజొన్న చేనులోని కంకులను చోరీ చేశారని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేస్తుండటంతో దుర్గంధం వ్యాపిస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. ఇండ్ల వద్ద తిరుగుతూ కనబడిన వస్తువులను తీసుకెళ్తున్నారని తెలిపారు. సదరు వ్యక్తుల నడవడికపై పోలీసులు విచారణ చేపట్టి వారి నుంచి స్థానికులకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోదాసి అశ్విని కుమార్, రాంప్రసాద్, సంకతాల శ్రీను, బైకని వెంకటేశ్, రైతు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న రాంబాబు, నాయకులు

బీసీ సంఘం మండల కమిటీ ఎన్నిక



నర్సంపేట : నూతన ఎన్నికైన సంఘం మండల కమిటీ బాధ్యులు

నర్సంపేట : చెన్నారావుపేటలో బీసీ సంక్షేమ సంఘం మండల కమిటీని మండల ఇన్‌చార్జ్ చెన్నూరి రవి, మండల మహిళా అధ్యక్షురాలు బండి విజయ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బర్ల యాకయ్య, ఉపాధ్యక్షులుగా పులి రమేశ్, ముత్యం చేరాలు, ప్రధాన కార్యదర్శిగా చామంతుల రమేశ్, కార్యదర్శిగా గొర్రె నవీన్, కార్మిక సంఘం అధ్యక్షుడిగా బండి వెంకటేశ్వర్లు, యూత్ విభాగం అధ్యక్షుడిగా బోనగిరి శరత్, ఉపాధ్యక్షుడిగా ఎగితి రాము, ప్రధాన కార్యదర్శిగా దాసరి రాములు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా డ్యాగల శ్రీనివాస్ మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా బీసీల బలోపేతం కోసం ఉత్సాహంగా పని చేసే వారికి కమిటీలలో సముచిత అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి సంగెం రమేశ్, జిల్లా నాయకుడు మరుపల వీరస్వామి, చెన్నారావుపేట మహిళా విభాగం గ్రామ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముంజ లక్ష్మి, కారుపోతుల శ్రీదేవి, నాయకులు మీరాల కుమారస్వామి, కంచ యాదగిరి, కుండెడు మల్లేష్, మీరాల వెంకన్న, గుర్రం రవి, బుర్ర సుదర్శన్‌గౌడ్, చీకటి నందు, జంపాల నవీన్, పాలిశెట్టి సాయి, తదితరులు పాల్గొన్నారు.

కురుమ సంఘం కమిటీ..

ఖానాపురం : కురుమ సంఘం మండల కమిటీని నర్సంపేట డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గోవిందు కుమారస్వామి, అధ్యక్షుడిగా పోతరాజు కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా కోరె మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా కుండె ప్రభాకర్, కోశాధికారిగా ఆరె సంపత్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా పోతరాజు దేవేందర్, మల్లయ్య, అన్న అశోక్, మండల రాములు ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడు కుమారస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు బోడగొండి భిక్షపతి, ఉపాధ్యక్షుడు కోరె సుధాకర్, ముఖ్య సలహాదార్లు కోరె రాము, బండి రాజుకుమార్, సహ కార్యదర్శి పోతరాజు లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా లింగయ్య



ఐనవోలు : సీపీఎం మండల కార్యదర్శిగా కాడబోయిన లింగయ్యను మరోమారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే మండల కమిటీ సభ్యులుగా నారాయణరెడ్డి, మడిగ నాగరాజు, దీకొండ ఉప్పలయ్య, రామ్‌కుమార్, మహేందర్, జక్కుల గోపి, దర్శనాల సంపత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కార్యదర్శి లింగయ్య, కార్యవర్గం మాట్లాడారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపింది. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమాలు నిర్మిస్తామని చెప్పారు.

‘స్థానిక’ ఎన్నికల్లో సత్తా చాటాలి

● బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి

ఆత్మకూరు : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి సత్తా చాటాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు తిరుమలగిరి గ్రామంలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశాలకు ఆయన హాజరై మాట్లాడారు. అనేక హామీలు గుప్పించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తదనంతరం హామీల అమలుతోపాటు ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు. గృహలక్ష్మి లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయలేకపోతోందని తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అందాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని, ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, మాజీ ఏఎంసీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి, నాయకులు రవి, రవీందర్, కుమారస్వామి, సుధాకర్, సుధాకర్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంజీవరెడ్డి

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ఐనవోలు : పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని వనమాల కనపర్తిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గడ్డం ఎల్లగౌడ్ (55) వ్యవసాయం, కులవృత్తైన గీత కార్మికుడిగా జీవనం కొనసాగించేవాడు. ఐదేళ్ల క్రితం తాటిచెట్టు పైనుంచి కింద పడగా కాలు విరిగింది. అప్పటి నుంచి ఏ పని చేయకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. దీంతో జీవితంపై విరక్తితో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మద్యం తాగేందుకు భార్య రజితను డబ్బులు అడగ్గా భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనోవేదన కు గురై పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉండగా ఒకరికి వివాహం కావాల్సి ఉంది. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఎల్లగౌడ్ (ఫైల్)